# టౌన్ బస్సుల జన్మ కథ

యమలోకంలో ఒక విచిత్రం జరిగింది!!

అందుకే ఆరోజు యమధర్మరాజు న్యాయస్థానం ఇట ఇటలాడి పోతోంది.

కలికాలం కీలకాలు ఆ లోకానికూడా పాకాయి.

కాగడాల వెలుగులో యమపీఠం ధగధగ మెరుస్తూవుంది. పీఠంపై యముడు భీకరంగా ఆశీనుడయి వున్నాడు.

చిత్రగుప్తుడు ముఖం వేలాడేసి వున్నాడు, విషాద భావప్రకటనతో.

మామూలుగా పాపులను విచారించే పాషాణకుదురులపై—ఆరోజు ఇద్దరు యమభటులను విచారించవలసివుంది.

అదే విచిత్రం!

అవినీతి ఆరోపించబడిన ఆ ఇద్దరు సీనియర్ యమభటులను కోర్టులో ప్రవేశపెట్టారు.

లావు తలలు, కొమ్ములున్న ఆ ఇద్దరు యమభటులను ఇనుప కచ్చడాలలో బిగించి, లాక్కొచ్చారు సాయుధులైన కొందరు యమభటులు.

లజ్జాభారంతో కృంగిపోతున్న ఆబొజ దూతలు, మదమణిగిన ఏనుగుల్లా యమ సింహాసనం ఎదురుగా గజగజా వణుకుతూ నిల్చున్నారు.

యమధర్మరాజు ఒక్కసారి మీసమును సవరించుకుంటూ, "ధర్మం యమాగా సాగుతోన్న ఈ లోకంలో కూడా అవినీతి? హుఁ! చిత్రగుప్తా వీరు చేసిన పాపంబేమి?? అలవాటు చొప్పున అడిగాడు. చిత్రగుప్తుడు చిత్రంగా కళ్ళు ఆర్పుతూ, గుటకలు మింగుతూ—పాపాల పుస్తకాన్ని పక్కన పెట్టి – సవినయంగా లేచి నిల్చుని, చేతులు కటుకున్నాడు.

భూలోకంలో మానవులు చేసిన తప్పులన్నీ రికార్డ్ చేసే చిత్రగుప్తుల వారికి - యమలోకంలోనే పాపాలు చేస్తే ఎక్కడ రాసుకోవాలో తెలియక బిత్తర పోయాడు కలవర పడ్డాడు. బిక్కు బిక్కుమని చూడసాగాడు. దిక్కు తోచక.

"ఊఁ....వివరించు. ఈ ఇద్దరు యమదూతలు చేసిన నేరమేమిటి?" అని భీకరంగా గర్జించాడు యముడు క్రోధానల జ్వాలలు ముఖంలో ప్రజ్వలిస్తుండగా.

తప్పుచేసిన యమదూతలు నెత్తిపై పిడుగులు పడ్డట్టు గగుర్పాటు చెందారు.

ఉలికిపడి. తెప్పరిల్లిన చిత్రగుప్తుడు. "చి....చిత్తం దేవరా! నిన్న ఓ పాపిని తమరు విచారించి, అతి కఠినంగా శిక్ష విధించి, అమలు జరపమని ఈ ఇద్దరి భటులకు అప్పగించారు. కానీ, ప్రభూ! వీళ్ళు ఆ పాపితో లాలూచీపడి, శిక్ష అమలు జరపకుండా మీ ఆజ్ఞను ధిక్కరించారు" అని చెప్పాడు చిత్రగుప్తుడు.

"ధిక్కారమా?" ఒక్క వికటాట్టహాసం చేశాడు యమధర్మరాజు, దిక్కులు పిక్కటిల్లేలా. ఆ నవ్వుకు యమలోకం ప్రతిధ్వనించింది. పట్ట పగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నట్లయింది. ప్రతిగా మహిష వాహనం ఘోరంగా రంకె వేసింది మెడలోని లోహపు గంటలను భయంకరంగా ఘణేల్ మనిపించింది. అందరూ గడగడలాడిపోయారు. యమలోకపు అధినేత నవ్వును ఒక్కసారిగా ఆపి, మిడిగుడ్లను ప్రదర్శిస్తూ, పళ్ళు పటపట కొరికాడు - నిప్పులు కక్కాడు అదనుకోసం ఎదురు చూస్తున్న గదపై చెయ్యి వేశాడు అందరి ఎదలో మృత్యు రొద ఆవహించింది. గాలి కూడా ఆగిపోయింది. "అతల సుతల పాతాళ తలాతల రసాతలములలో

ధర్మ ప్రతిష్ఠకు అధినాధుండ యమధర్మనామధేయుండ - నా లోకమున నాకలోకమున ధిక్కారమా?? ఏమది??" అని నేరస్థులైన ఆ యమ దూతలను చూస్తూ," జరిగినదంతా యథాతదంగా విన్నవించుకుంటే శిక్ష తగ్గుతుంది, చెప్పండి'' అని గదమాయించాడు నాక ప్రభువు

అప్పటికి బిక్క చచ్చివున్న ఆ ఇద్దరు యమభటులు - ఒకరి తర్వాత ఒకరు - గుక్క తిప్పుకోకుండా చెప్పసాగారు—

"మన్నించాలి మహాప్రభువులు! బుద్ధి యమగడ్డి తిని చేశాం యీ పని—

నిన్న మీరు మాకు అప్పజెప్పిన పాపికి మీ ఆజ్ఞ ప్రకారం గుడ్డలూడ బెరికి, ముళ్ళ చెట్టుకు కట్టేసి, వళ్ళంతా బెల్లం పూసి, ఇనుప ముక్కు లున్న గండ్ర చీమల్ని, విషపు జెరుకుల్ని వదలమన్నారు-ఎఱ్ఱటి ఎండలో ఏడు రోజులు వరసగా—

శిక్ష అమలు పరుద్దామని వెళ్ళాము— పాపికి గుడ్డలూడ బెరికాము, చెట్టుకు కట్టేశాము, నాలుగు లడ్డీలు బెల్లం తెప్పించాము వళ్ళంతా పూయాలని. ముందుకు పోతే— మా కొంప ముంచాడు, ఆ నరుడు— మాకు ఏవేవో ఆశలు చెప్పి, ఇరుకున పెట్టాడు. ఆ నరుడు మాతో యిలా చెప్పాడు.

"ఒక్క క్షణం ఆగండి! నా మాటలు వినండి! యమధర్మరాజు శిక్ష విధించిన ప్రకారం నన్ను యిలా చెట్టు దగ్గర నిలబెట్టండి, చాలు. అంతకన్నా మరేం చేయకండి, శిక్ష అమలు జరిగినట్టే, రోజుకు నాలుగు లడ్డీల బెల్లం చొప్పున 7 రోజులకు 28 లడ్డీల బెల్లం మిగిలి పోతుంది మీకు, మీరిద్దరూ కలిసి చెరి 14 లడ్డీల బెల్లం పంచుకోవచ్చు. మీ

పెళ్ళాం, పిలకాయల నోరు తియ్ తీయగా చేయొచ్చు, అంతేగాని - నావంటికి పూస్తే మీకేం లాభం ?" "మరి మా లోకం ధర్మం అందుకు ఒప్పు కోదు - అంటూ అప్పటికే అడ్డు తగిలాం ప్రభూ! అయినా ఆ నరుడు మమ్మల్ని మైమరిపించాడు మళ్ళీ యిలా చెప్పసాగాడు''—

"—మా లోకంలో కూడా అంతే! అయితే రూల్స్ పాటికి రూల్స్ - మా పాటికి మేము! అసలు అంతెందుకు - మీరంతా ఎంత పాపం చేశారో పాపం! కొన్ని కోట్ల సంవత్సరాలుగా యిలా గొడ్డు చాకిరే చేస్తున్నారు. మీకు టి ఎ ఈ డి ఎ వుందా?? ఇంక్రిమెంట్ వుందా?? బోనస్ వుందా?, ప్రమోషన్ వుందా?? అలవున్స్ సెస్ వున్నాయా?? పాపం! ఎంత అమాయకులు మీరు? మిమ్మల్ని చూస్తుంటే - నాకు చచ్చేంత జాలేస్తుంది. ఇదే మా లోకంలో అయితేనా అన్నీ డిమాండ్ చేసి తీసుకొంటాం సమ్మెలు, బంధ్‌లు, రాస్తారోకోలు, రైల్ రాకోలు, ధర్నాలు, పికెటింగ్‌లు ఘెరావ్‌లూ, కిడ్నాప్‌లు - అవసరం అనుకుంటే హత్యలు చేసేందుకు కూడా వెనుకాడం, అదీ మా లోకంలో ధర్మం, పిచ్చివాళ్ళల్లారా! నామాట విని, ఆ లడ్డీల బెల్లం గడ్డలు గుట్టు చప్పుడు కాకుండా మీ యింట్లో చేరేసుకోండి, శిక్ష అమలు జరపలేదని నేను చెప్పను, మీరు చెప్పకండి, అంతే! - అని చెప్పి మమ్మల్ని మభ్య పెట్టాడుదొరా!" అంటూ వలవల ఏడ్చారు యిద్దరు యమభటులు "ఫలితంగా ఆ నాలుగు లడ్డీల బెల్లం ఇద్దరూ పంచుకుని, పాపం చేశారు ప్రభూ!" అని ముగించాడు చిత్రగుప్తుడు.

"లోపాలతో పాపాలుచేసి, ఈ లోకంలో శాపాలు అనుభవించే నరాధములతో నాభృత్యులు కుమ్మక్కయి, నా ఆజ్ఞను ధిక్కరించుటయా? అవమానము; ఇది యమలోకమునకే అప్రతిష్ట'' అంటూ పళ్ళు పటపట కొరికాడు

యమభటులు భయకంపితులై పోసాగారు, చివరి గడియలన్నట్లు ఒకరి ముఖం ఒకరు చూసుకోసాగారు. అక్కడ ఒక్కరూ బుస కూడా వదిలి నట్లు లేరు. శిలా ప్రతిమలయినట్లున్నారు.

యమధర్మరాజు ఘణేలని పైకి లేచాడు, గదను తీసి, భుజంపై వేసుకున్నాడు, మీసం మెలి తిప్పాడు, రోషాయుత నేత్రుడయ్యాడు క్రోధానల జ్వాలలను కళ్ళల్లోంచి వెళ్ళగక్కాడు నేరం చేసిన ఆ ఇద్దరు యమభటులను ఆగ్రహంగా చూస్తూ—" ఇన్నాళ్ళూ నా అదుపాజ్ఞలలో మెలిగి, ఈనాడు ఒక్క తుచ్ఛ మానవుని చేతిలో కుబ్చితులై పోయారు నా ఆజ్ఞకంటే ఆ నరుని మాటను పైన వేసుకున్నారు, కాబట్టి మీరు ఆ నరలోకంలోనే పుట్టి - నరులను, బరువులను మోస్తూ బతకండి! పొండి! ఇదే మీకు నా శాపం" అంటూ కఠినంగా శపించాడు - గద పైకెత్తి.

ఒక్క మెరుపు మెరిసింది - తళుక్కుని - ఒక్క ఉరుము ఉరిమింది - పెళాపెళార్భాటంతో - ఆ యమభటులిద్దరు శత సహస్ర ముక్కలుగా విడిపోయి - భూమ్మీదపడి, టౌన్ బస్సులుగా లారీలుగా అవతరించారు. ఆనాటి నుండి యీ - టివరకూ నరులను మోస్తూ, బరువులను మోస్తూ - తమకు ఆ గతి కలిపించిన మానవుల్ని సాధ్యమైనంత మేరకు యాక్సిడెంట్స్ చేసి - చంపుతూ గడుపుతున్నారు.

మరి, శాప విమోచనం ఎప్పుడో??

[ఈ మధ్య లారీలు, టౌన్ బస్సులు - కనీసం ట్రాఫిక్ రూల్స్‌ను కూడా అతిక్రమించి - అనేక యాక్సిడెంట్స్ చేస్తున్నట్లు పత్రికల్లో వస్తున్న వార్తలను చదివాక - రచయిత.]